

రావణకాష్ట సినిమా చిత్రీకరణ


ముహూర్తం షాట్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే

మదనపల్లె అర్బన్: మదనపల్లెకు చెందిన కళాకారులు రావణకాష్ట ఒటిటి సినిమాకు శ్రీకారం చుట్టారు. స్థానిక శ్రీవేంకటేశ్వర ఆలయంలో పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి క్లాప్ కొట్టి ముహూర్తం షాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒటిటి ఫిల్మ్‌ని తీయడానికి మన మదనపల్లెలో శ్రీకారం చుట్టడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. దర్శకుడు బిజర్ ప్రసాద్ మాట్లాడుతూ మనిషిలో అహం క్రోధం ద్వేషం ప్రేమ సమ్మిళిత మా ఈ రావణకాష్ట అని మనసుకు హత్తుకునే కథ కథనంతో మదనపల్లె పరిసర ప్రాంతాలలో ఈ సినిమాను షూటింగ్ జరుగుతుందని తెలిపారు. ఈ చిత్రాన్ని మదనపల్లె ప్రజలు ఆదరిస్తారని ఆశిస్తున్నానని తెలిపారు. ఈ చిత్రంలో ఉమేష్ కుమార్, స్నేహ ఆచార్య, ఉదయ్ కుమార్, దినకర పులకుంట్ల, సైయదబాషా, వందే కుమార్ శర్మ, ఫిరోజ్, పవన్ కళ్యాణ్, మంజునాథ్, రాధిక నటిస్తున్నారు.

అట్టహాసంగా నామినేషన్లు

కడప, అనంతపురం కలెక్టరేట్లలో కోలాహలం
స్థానిక సంస్థల, పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థుల జోరు
భారీ అనుచరగణంతో తరలిన అభ్యర్థులు


అనంతపురంలో నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్లు అట్టహాసంగా దాఖలయ్యాయి. ఈ నెల 13 నుంచి 23వ తేదీతో నామినేషన్ల గడువు ముగియనుంది. బుధవారం నామినేషన్ల జోరు వెల్లువెత్తింది. నామినేషన్ల దాఖలు గడువు ముగింపునకు ఒక్కరోజు సమయం ఉండగానే కడప, అనంతపురం కలెక్టరేట్లలో స్థానిక సంస్థల, పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పలువురు తమ అనుచర గణాలతో కలిసి పోటాపోటీగా దాఖలు చేశారు. కడప, అనంతపురం కలెక్టరేట్లలో సందడి వాతావరణం నెలకొంది. నామినేషన్ల దాఖలు చేయడానికి ఆశావహులు పెద్దఎత్తున తరలిన నేపథ్యంలో కలెక్టరేట్ల ఎదుట భారీగా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. అనంతపురం జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల అధిక సంఖ్యలో ఉన్న సంగతి తెలిసిందే. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు అనంతపురం కలెక్టరేట్‌లో నామినేషన్లు దాఖలు చేయడానికి మొగ్గు చూపించినట్లు కనిపిస్తోంది. పట్టభద్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు, టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, వైసిపి అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి సహా పలువురు స్వతంత్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, ఎ.రామచంద్రారెడ్డి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, భారీ అనుచరులతో కలిసి నామినేషన్లు దాఖలు చేశారు. కడప కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి మాజీ మంత్రి పి.రామసుబ్బారెడ్డి నామినేషన్ వేశారు. జిల్లాలో వైసిపికి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు గణనీయ సంఖ్యలో ఉండడం, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు చేతివేళ్ల మీద లెక్కపెట్టాల్సిన పరిమిత సంఖ్యలో అభ్యర్థులు గెలిచిన సంగతి తెలిసిందే. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఆశావహులు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడానికి ముందుకురాని నేపథ్యం నెలకొంది. వైసిపి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం దాదాపుగా ఏకగ్రీవమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈలెక్కన పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థుల మధ్య ప్రధానంగా ఎన్నికల్లో పోటీ నెలకొనే అవకాశాలు ఉన్నట్లు పరిశీలకుల అంచనా.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పిఆర్ నామినేషన్ దాఖలు

కడప: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా మాజీ మంత్రి పి.రామసుబ్బారెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారి జెసి సాయికాంత్ వర్మ నామినేషన్ పత్రాలను సమర్పించారు. రామసుబ్బారెడ్డి వెంట ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, వైసిపి జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా ఉన్నారు. అంతకు ముందు శిల్పారామంలో ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీగా రామసుబ్బారెడ్డి గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, వైసిపి కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులు సురేష్ బాబు, శ్రీకాంత్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కోరుముట్ల శ్రీనివాసులు, సుధీర్‌రెడ్డి, డాక్టర్ సుధా, జిల్లాలోని జడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకలను చట్టసభలకు పంపుదాం

అనంతపురం ప్రతినిధి: ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకలను చట్టసభలకు పంపించాలని ఎమ్మెల్సీ వి.వెంకటేశ్వరరావు అన్నారు. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజు అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట తప్పను.. మడమ తిప్పను.. అన్న ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి, ఉద్యోగులు, కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్కమాటను నిలుపుకోలేదని చెప్పారు. ఆయన మాటా తప్పాడు...మడమా తిప్పాడూ అని విమర్శించారు. చట్ట సభల్లో ప్రజా సమస్యలపై ఇప్పుడు చర్చ జరగడం లేదని విచారం వ్యక్తం చేశారు. పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించి మండలికి పంపాలని పిలుపునిచ్చారు. ప్రశ్నించే గొంతుకలను మండలికి పంపడం ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించగలన్నారు. ఎమ్మెల్సీ సాబ్జి మాట్లాడుతూ మండలి ఎన్నికలు కౌరవులు, పాండవులకు మధ్య జరుగుతున్న పోరు అని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిలదీసే పిడిఎఫ్ అభ్యర్థులను ఓడించేందుకు అధికారపార్టీ సాయశక్తులను ఒడ్డుతోందని చెప్పారు. పిడిఎఫ్ పట్టభద్రుల అభ్యర్థి పోతుల నాగరాజు మాట్లాడుతూ ఇన్ని ప్రజాసంఘాలు వచ్చి తమ అభ్యర్థిత్వాన్ని బలపరచడంతోనే తమకు నైతిక విజయం లభించినట్టయిందన్నారు. కొంత మంది అధికారులను ఇక్కడికి పంపి ప్రలోభ పెట్టే ప్రయత్నాలు ఇప్పటికే చేస్తోందన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి విస్మరించారని తెలిపారు. సిపిఎస్‌పైనా, పిఆర్‌సిపైనా మండలిలో గొంతెత్తామని తెలిపారు. రాబోయే రోజుల్లోనూ ఈ సమస్యలపై పోరాటాన్ని సాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ఎఐటియుసి, యుటిఎఫ్, ఎస్టీయు, ఐద్వా, ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎఐవైఎఫ్, బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


కడప : ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న పిఆర్

సిఎంను కలిసిన ఎఫ్‌యూ విసి

కడప అర్బన్: నగరంలోని డాక్టర్ వైయస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ (ఎఫ్‌యూ) విసిగా ప్రొఫెసర్ బి.ఆంజనేయ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. బుధ వారం క్యాంప్ కార్యాలయంలో సిఎం జగన్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎఫ్‌యూ మొట్ట మొదటి విసిగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్శిటీ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు. ఎఫ్‌యూని దేశంలోనే ప్రత్యేకమైన విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దుతానని చెప్పారు.

సౌకర్యాలు ఎక్కువ.. వైద్య సేవలు తక్కువ

- మధ్యాహ్నం వరకే ఆస్పత్రి సిబ్బంది
- ఐరన్ మాత్రలకు చెదలు
- నిర్లక్ష్యంగా వైద్యుల పనితీరు
- నిద్రమత్తులో ఉన్నతాధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు


నగిరిమడుగులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మండలంలోని నగరిమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని సౌకర్యాలు మెండుగా ఉన్నా.. వైద్యుల నిర్లక్ష్యం వలన వైద్య సేవలకు అస్వస్థత చేస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ.. మధ్యాహ్నం పిహెచ్‌సికి తాళాలు వేసుకొని వెళ్లిపోతారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇక్కడ ఒపి కూడా రోజుకి 60 నుంచి 80 వరకు మాత్రమే వస్తుందని, వైద్యుల పనితీరు మెరుగ్గా ఉంటే మరింత పెరిగే అవకాశం కూడా ఉన్నట్లు చర్చించుకుంటున్నారు. పిహెచ్‌సిలో సౌకర్యాలకు కొదవ లేకుండా కాన్పులగది, ఆపరేషన్ థియేటర్, స్త్రీలకు, పురుషులకు వార్డులు, ల్యాబ్‌లు ఇలా అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ఇద్దరు వైద్యులు, ఏడు మంది సిబ్బంది పని చేస్తున్నారు. ఆసుపత్రి వైద్యులుగానీ, సిబ్బందిగానీ సమయపాలన పాటించరనే పుకార్లు షికార్లు కొడుతున్నాయి. గ్రామస్థులకు జబ్బు చేస్తే సుమారు 10కిలో మీటర్ల దూరంలో ఉన్న చింతపర్తి పిహెచ్‌సికి లేదా వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రికి రావాల్సి వుంటుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరిమడుగులో పని చేసే ఓ ఉద్యోగి వాల్మీకిపురంలో ఉంటారని, పంచాయతీ కార్యాలయం, టీస్టాల్‌లో కాలయాపన చేస్తూ.. మధ్యాహ్నం 3 గంటలు అయితే ఇంటికి వెళ్లిపోతారని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో ఆసుపత్రిలో ఎవ్వరూ లేకపోవడంతో ఆసుపత్రిలోని కుర్చీలు, బెడ్లు అన్నీ దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్నాయి.



చెదలు పట్టిన ఐరన్ మాత్రలు, ఖాళీగా దర్శనమిస్తున్న డాక్టర్ గది

మధ్యాహ్నం వరకే ఆసుపత్రి : నగరిమడుగు పిహెచ్‌సి రోజు మధ్యాహ్నం వరకు మాత్రమే పని చేస్తుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రోజు రావడం మధ్యాహ్నం వరకు ఉండడం, మధ్యాహ్నం అయితే ఆసుపత్రికి తాళాలు వేసుకొని వెళ్లిపోతారని గ్రామస్థులు చెబుతున్నారు.

నిర్లక్ష్యంగా వైద్యుల పని తీరు : వైద్యులు సైతం ఆసుపత్రిలో ఉండరని, ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ ఇద్దరు సక్రమంగా పని చెయ్యరనే ఆరోపణలు అనేకం.

మాత్రలకు చెదలు : పిహెచ్‌సిలో ఉన్న మాత్రలకు చెదలు పట్టడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రికి వచ్చే వారికి ఇలాంటి మాత్రలే ఇస్తారని అని మండిపడుతున్నారు. ఏది ఏమైనప్పటికీ ఉన్నతాధికారుల పర్యవేక్షణాలోపం వలనే ఇక్కడ సిబ్బంది పని తీరు సక్రమంగా ఉండడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

నిద్రమత్తులో ఉన్నతాధికారులు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసే ఉన్నతాధికారులు నిద్రమత్తులో జోగుతుండడంతో ఇక్కడ వైద్యుల పనితీరు సక్రమంగా ఉండడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పిహెచ్‌సిలను తనిఖీ చేసి, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మధ్యాహ్నం వరకే ఉంటారు

నగిరిమడుగు ఆసుపత్రిలో అందరూ మధ్యాహ్నం వరకు ఉంటారు. మళ్లీ మధ్యాహ్నం వచ్చే బస్సులో అందరూ ఆసుపత్రికి తాళాలు వేసుకొని వెళ్లిపోతారు. ఎవరికైనా జబ్బు చేస్తే వాయల్పాడుకు పోవాలి. ఇక్కడ డాక్టర్లు, సిబ్బంది సక్రమంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

-వెంకట్రమణ, గ్రామస్తుడు, నగిరిమడుగు, వాల్మీకిపురం.

ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ గుర్తింపు ఆధారిత హాజరు వంద శాతం అమలయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం తాడేపల్లి నుండి కార్యదర్శి ముత్యాల రాజు సిఎఫ్ ఎంఎస్ అధికారి సునీల్‌రెడ్డితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ముఖ గుర్తింపు ఆధారిత హాజరు అమలుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ గిరీష, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, డిఆర్ఒ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీష మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ఉద్యోగికి ముఖ గుర్తింపు ఆధారిత హాజరు తప్పనిసరి చేసిందని ఉద్యోగులందరూ ఎపిఎఫ్ఆర్ఎస్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని తప్పకుండా ముఖ ఆధారిత హాజరు వేయాలన్నారు. ఇంకా ఎవరైనా ఎఫ్ఆర్ఎస్ యాప్ డౌన్లోడ్ చేసుకోని వారు ఉంటే వెంటనే యాప్ డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ప్రతి ఉద్యోగి ఉదయం సాయంత్రం తప్పకుండా ముఖ గుర్తింపు ఆధారిత హాజరు వేయాలన్నారు. క్యాంపు వెళ్ళిన అధికారులు, ఆన్ డ్యూటీలో ఇతర ప్రాంతంలో ఉన్న అధికారులు యాప్‌లో ఉన్న నిబంధనల మేరకు హాజరు వేయాలన్నారు. ఇందులో ఎటువంటి సాంకేతిక సమస్యలు, సందేహాలు ఉన్నా వెంటనే ఎన్ఐసి వారిని సంప్రదించి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా సిబ్బంది ముఖ గుర్తింపు ఆధారిత హాజరును సంబంధిత డిడిఒలు పర్యవేక్షించాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష


సమావేశంలో మాట్లాడుతున్న ఖాదర్‌బాషా

రాష్ట్రంలో అరాచకాలు పెరిగిపోతున్నాయి : టిడిపి

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వ ఆరాచక, విధ్వంసకర పాలనలో ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదరభాష పేర్కొన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక పాలనను ప్రశ్నిస్తే ప్రజలు, ప్రతిపక్షాలపై దాడులు, కేసులు, హింసాత్మక ఘటనలు, పోలీసు టార్చర్ అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఇందుకు గన్నవరం ఘటనలో తెలుగు దేశం పార్టీ కార్యాలయంపై, పార్టీనేతల ఇళ్లపై, కార్యకర్తలపై దాడులు చేసి వారిఆస్తులు ధ్వంసం చేయడంతో పాటు వారినే పోలీస్ టార్చర్‌కు గురిచేసి ఆ బాధితులనే నిందితులుగా మార్చి, జైలుకు పంపిన వైనం చరిత్రలో జరగలేదన్నారు. అరాచక పాలనతో ప్రజల ధన మాన ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందిని జీవితాంతం కష్టపడి పేదలు సంపాదించుకున్న ఆస్తులను కబ్జా చేస్తున్నారు. ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తల నిర్బంధాలు, అక్రమ కేసులు బడుగు, బలహీన, దళిత, మైనారిటీ వర్గాలకు వేధింపులు, మహిళలపై ఆకృత్యాలకు రాష్ట్రం వేదికగా మారిందన్నారు.మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనలకు అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన కనిపిస్తుందన్నారు. ప్రజా సమస్యలపై నిలదీస్తున్న టీడీపీ నేతలను జైలుకు పంపాలి అనే ఏకైక ఉద్దేశ్యంతో టీడీపీ నేతలపై హత్యాయత్నం, అట్రాసిటీ సెక్షన్ కింద కేసులు జైలు పాలు చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డికి ప్రజల తగిన గుణపాఠం చెప్తారని చెప్తారన్నారు. కార్యక్రమంలో చిన్నమండ మండల అధ్యక్షుడు బెల్లం నర్సింహారెడ్డి, రాజంపేట పార్లమెంటరీ కార్యనిర్వాహ కార్యదర్శి హరి, అమర్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థుల నామినేషన్‌కు తరలివెళ్లిన నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బుధవారం అనంతపురం పిడిఎఫ్ అభ్యర్థులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు నామినేషన్ కార్యక్రమంలో రాజంపేట సిఐటియు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ సర్వేపల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ మార్పు, అభివృద్ధి కోసం పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని తెలియజేశారు.

సచివాలయంలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని పొన్నెటిపాలెం, కురవంక గ్రామ సచివాలయాన్ని జిల్లా డిఎల్‌డిఒ లక్ష్మీపతి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయానికి వచ్చే అర్జీలను పరిశీలించి అప్పటికప్పుడే పరిష్కరించాలని ఆదేశించారు. సచివాలయానికి ఎన్ని అర్జీలు వచ్చాయో వాటిని నోట్ బుక్కులో ఎంట్రీ చేయాలని పేర్కొన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువత విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

- క్రికెట్ పోటీల ప్రారంభంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

క్రీడలకు వైసిపి ప్రభుత్వం ప్రత్యేక ప్రాముఖ్యతను కల్పించిందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఈద్గా ప్రాంగణంలో బుధవారం అబుసిద్దిక్ ట్రావెల్స్ స్పాన్సర్షిప్‌తో, వైసిపి మైనార్టీ నాయకులు బేపారి మహమ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ క్రీడా పోటీలను స్థానిక మున్సిపల్ చైర్మన్ షేక్ ఫయాజ్ బాషా, వైస్ చైర్మన్ ఫయాజు రెహ్మాన్, మాజీ ఎంపిపి పోలు సుబ్బారెడ్డి, మండల బిసి నాయకులు పల్లపు రమేష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. వీరికి స్థానిక వైసిపి నాయకులు, యువత ఘన స్వాగతం పలికారు. అనంతరం క్రీడా మైదానంలో క్రీడా కారులతో ముచ్చటించారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా బంతిని వేయగా ఎమ్మెల్యే బ్యాటింగ్ చేసి క్రీడాకారులును ఉత్సాహ పరిచారు.ఎమ్మెల్యే టాస్ వేసి క్రీడా కారులకు అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా అయానాక్ మాట్లాడుతూ యువతలలో క్రీడా నైపుణ్యం నింపేందుకు అబుసిద్దిక్ ట్రావెల్స్ వారి సహకారంతో బేపారి మహమ్మద్ ఖాన్ క్రికెట్ పోటీలను నిర్వహించడం చాలా అభినందనీయమన్నారు. క్రీడలలో ఓటమి గెలుపులు సహజమేనని, ప్రతి క్రీడా కారునిలో క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలన్నారు. విజేతలకు మొదట బహుమతిగా రూ.50 వేలు, రెండవ బహుమతిగా రూ.30 వేలు అందచేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఫయాజ్ అహమ్మద్, సాదక్ అలీ, షబ్బీర్, సుగవాసి శ్యామ్, జిల్లా వక్ఫ్ బోర్డ్ సభ్యులు జాకీర్, నవరంగ్ నిస్సార్, కొలిమి ఛాన్ బాష, ఫయాజ్, రౌనక్,జిన్నా షరీఫ్, కో-ఆప్షన్ సభ్యులు ఖాదరవల్లి, మాజీ కో-ఆప్షన్ సభ్యులు జాఫర్, మాజీ జడ్‌పిటిసి హసన్‌బాష, ఆర్ట్స్ శంకర్, మూస, షకీల్, కొత్తపల్లి ఇంతియాజ్, విక్కీ, అజ్మత్, ఫైరోజ్ ఖాన్, బేపారి జబివుళ్ళా ఖాన్, అసద్ ఖాన్, ఖైజర్, రఫీ పాల్గొన్నారు.


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో సెక్టోరల్ అధికారులదే బాధ్యత'


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో సెక్టోరల్ అధికారులదే కీలక బాధ్యతని, పోలింగ్ అధికారులకు ఈ వారంలోనే శిక్షణ ఇవ్వాలని, ఓటింగ్ ప్రక్రియపై ఓటర్లకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్షా సమావేశంలో జిల్లా అధికారులను కలెక్టర్ గిరీష్ ఆదేశించారు. జిల్లాలో జరగనున్న ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సన్నద్ధతపై కలెక్టర్ గిరీష్ జిల్లా నోడల్ అధికారులతో బుధవారం స్థానిక కల్లెక్టరేట్‌లోని స్పందన హాల్లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2023 మార్చి 13న జరగబోయే గ్రాడ్యుయేట్, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి భారత ఎన్నికల సంఘం 2023 ఫిబ్రవరి 16న నోటిఫికేషన్ ఇచ్చిందని, జిల్లా అధికారులందరికీ ఎన్నికల విధులు కేటాయించామని తెలిపారు.ఎన్నికల నిర్వహణలో ఓటర్ల జాబితా తయారీ, ఎన్నికల సామగ్రి సేకరణ, పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సౌకర్యాలు, ఎన్నికలకు అవసరమైన సిబ్బంది, రవాణా, పోస్టల్ బ్యాలెట్ పత్రాల తయారీ, పోలింగ్ అధికారులకు శిక్షణ అత్యంత కీలకమని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని, రవాణా సౌకర్యాలను, ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల సమయంలో వెబ్ కాస్టింగ్‌పై పలు సూచనలు చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. సున్నితమైన, అతిసున్నిత పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని, ఆ స్టేషన్లలో అవసరమైన భద్రతా ఏర్పాట్లను గుర్తించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. బ్యాలెట్ పత్రాలు మరియు బ్యాలెట్ బాక్సులు మంచి స్థితిలో ఉండేలా చూడాలని ఆయా బాధ్యతను కేటాయించిన నోడల్ అధికారిని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌ను పక్కాగా ఏర్పాటు చేయాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. రాజకీయ పార్టీలు, ఇతరుల నుండి వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి, తీసుకున్న చర్యలను ఫిర్యాదు రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, డిఆర్ఒ సత్యనారాయణ, మదనపల్లె, రాయచోటి ఆర్డీఓలు మురళి, రంగస్వామి, నోడల్ అధికారులు, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ ధనలక్ష్మి

గర్భిణులకు మెరుగైన పౌష్టికాహారం : పీడీ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అంగన్‌వాడీ కేంద్రాల్లోని గర్భిణులకు మెరుగైన పౌష్టికాహారం అందించాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ధనలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో ప్రాజెక్టు పరిధిలోని గుర్రంకొండ, వాల్మీకిపురం, కలకడ, కలికిరి మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలకు ఎడబ్ల్యూసీలో ప్రతి రోజు పాలు, గ్రుడ్లుతో పాటు భోజనం అందించాలన్నారు. ఆరోగ్య సిబ్బందితో కలసి కాల్షియం, ఐరన్ మాత్రలను తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీల పరిధిలో బరువు తక్కువగా ఉన్న పిల్లలు, పొట్టిగా ఉన్న పిల్లలను ఖచ్చితంగా గుర్తించాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు, ఏడు నుంచి మూడు సంవత్సరాలు, మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు వైఎస్సార్ ఎస్‌పి పథకం క్రింద పోషకాహారం ఏ విధంగా పంపిణీ చేయాలన్న అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ భారతి, సూపర్‌వైజర్లు రోహిణి, యశోద, మహాలక్ష్మి, విజయలక్ష్మి, రాణి, సుశీల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈద్గా నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలి : 'గడికోట'

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

పవిత్రమైన రంజాన్ పండుగకు ముస్లిం మైనార్టీలు నిర్వహించే ప్రార్థనలకు ఈద్గా ఖానా నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ముస్లిం మైనార్టీలు ప్రార్థనలు నిర్వహించే ఈద్గా ప్రాంగణంలోని ఎంపీ మిథున్‌రెడ్డి నిధులతో ఈద్గా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్ పరువేక్షణలో జరుగుతున్న వజు ఖానా నిర్మాణం పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ ఈద్గా ప్రాంగణంలో వాకింగ్ టాక్, పచ్చదనాన్ని పెంపొంచెందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ ఫయాజ్ బాషా,వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహ్మాన్ లతో పాటు వైకాపా మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.


ఈద్గా పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మొరుసు కాపులు

బిసి 'బి' కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలి

ప్రజాశక్తి-కురబలకోట

మొరుసు కాపురెడ్లకు జిఒ 33 ప్రకారం బిసి బి కుల ధ్రువీకరణ పత్రాన్ని మంజూరు చేయాలని ఆ సంఘం నాయకులు మార్కిరి ఆంజనేయ రెడ్డి, ముత్ర దామోదర్ రెడ్డిలు బుధవారం తహశీల్దార్‌ను కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఒ అమలులోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్నా ఇంత వరకు సర్టిఫికేట్‌ను ఇవ్వక పోవడం దారుణన్నారు. ఇప్పటికే మొరుసుకాపు కుటుంబాలు విద్యా పరంగా, ప్రభుత్వ పథకాలు పరంగా ఎన్నో కోల్పోయామని తహశీల్దార్‌కు తెలిపామని చెప్పారు. తహశీల్దార్ స్పందించి జిఒ 33 ప్రకారం మీకు అర్హత ఉంది కాబట్టి, విఆర్‌ఒ లకు సర్కులర్ జారీ చేసి సమగ్రమైన సమాచారం తెప్పించు కుంటామన్నారు. ఉన్నతాధికారుల సూచనలతో బిసిబి సర్టిఫికెట్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారని అన్నారు. కార్యక్రమంలో మొరుసు కాపు రెడ్డి(ఒక్కలిగర) సంఘం ప్రతినిధులు ముత్ర దామోదర్ రెడ్డి, మార్కిరి ఆంజనేయరెడ్డి, బైసాని హరినాథ్‌రెడ్డి, ఎం.రమేష్‌రెడ్డి, తరుగు శివారెడ్డి, ఒడిగెల ప్రతాపరెడ్డి, సూరపు శంకర్‌రెడ్డి, సర్పంచులు కోళ్ల వాసుదేవరెడ్డి, సోమిరెడ్డి, ఎంపిటిసి రవీందర్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, తూపల్లి వేణురెడ్డి, వనిమిరెడ్డి రెడ్డి, శేఖర్ రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, మీసేవ రవీందర్‌రెడ్డి, ఎర్రబెల్లివేణురెడ్డి ,సదానందరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి

లోకేష్ పాదయాత్రను జయప్రదం చేద్దాం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

మార్చి మొదటి వారంలో మండలంలో జరిగే టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రను విజయవంతం చేద్దామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం వేణు మహల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన సమావేశాన్ని నిర్వహించారు. లోకేష్ పాదయాత్ర విజయవంతం చేయడానికి చేపట్టాల్సిన కార్యాచరణను పంచాయతీల వారీగా కార్యకర్తలతో ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు సుధాకర్ రెడ్డి, మాజీ జడ్పిటిసి డాక్టర్ మల్లెల రెడ్డి బాష, మండల పార్టీ కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు అమర్నాథ్‌రెడ్డి, రెడ్డప్పరెడ్డి, శ్రీనాథరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కైలాసనాథేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించిన 'చమర్తి'

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని టంగుటూరు గ్రామంలోని శ్రీకామాక్షాంబ సమేత కైలాసనాథేశ్వర స్వామివారి ఆలయాన్ని బుధవారం నియోజకవర్గ టిడిపి నాయకులు చమర్తి జగన్ మోహన్ రాజు సందర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం తో పాటు స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ పెద్దలు ఆయనను ఘనంగా సత్కరించి సన్మానించారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన 'దేవనర్తకి నాటకం' కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి యల్లటూరు శివ రామరాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎద్దుల విజయసాగర్, బిసిసెల్ రాష్ట్ర కార్యదర్శి సమ్మెట శివప్రసాద్, సుబ్బరాజు, సుధాకర్ రాజు, నందకుమార్ నాయుడు, టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్, తెలుగు యువత పట్టణ అధ్యక్షులు రాము యాదవ్, తెలుగు యువత పార్లమెంట్ ఉపాధ్యక్షులు కొండిశెట్టి సుదర్శన్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-కలికిరి



ఉపాధ్యాయుడు విశ్వనాథయ్య(ఫైల్ ఫొటో)

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పత్తేగడ పంచాయితీ కొటాలకు చెందిన విశ్వనాదయ్య(47) గుట్టపాలెం పంచాయతీ చీకిరాల బర్నేపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఈయన గత కొంత కాలంగా అనారోగ్య బారిన పడటంతో ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటూనే పాఠశాలకు వెళ్లేవాడు. ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి కార్యకర్తలతో వారి ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. తోటి ఉపాధ్యాయులు ఆయన మృత దేహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మరణం ఉపాధ్యాయ లోకానికి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు.

రాజకీయ నాయకుల బ్యానర్ల తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-గాలివీడు

శాసన మండలి ఎన్నికల దృష్ట్యా ఈనెల 9 నుంచి ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. మార్చి 13న జరగనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా మండల కేంద్రంలో 'తొలగని బ్యానర్లు' అన్న శీర్షికతో ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. తహశీల్దార్, ఎంపిడిఒ, ఎస్ఐ స్పందించి బస్టాండ్ నుంచి గేటు వరకు రోడ్లపైన, బిల్డింగుల పైన ఉన్న రాజకీయ నాయకులకు సంబందించిన కటౌట్లు, బ్యానర్లను తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు.

పాత నేరస్తులకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



పాత నేరస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సిఐ మురళీకృష్ణ

శాసనమండలి ఎన్నికల సందర్భంగా పాత నేరస్తులు, నేర చరిత్ర కలిగిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు మదనపల్లి టూటౌన్ సిఐ ఎస్.మురళీకృష్ణ తెలిపారు. ఎస్‌పి వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు, డిఎస్‌పి కేశప్ప పర్యవేక్షణలో మార్చిలో జరగబోయే శాసనమండలి ఎన్నికల సందర్భంగా నేరచరిత్ర కలిగిన పాతనేరస్తులు, గంజాయి కేసులలో పట్టుబడి జైలుకు వెళ్లి వచ్చిన వారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. మరలా ఏదైనా నేరాలకు పాల్పడినా, గొడవలు సృష్టించినా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో జాగ్రత్తగా మెగాలని సూచనలు చేశారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చెప్పారు. అనంతరం వారిని తహ శీల్దారు వద్ద బైండో చేసినట్లు సిఐ తెలిపారు.

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి



అబుల్ కలాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సమితి సభ్యులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని బుధవారం మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అబుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా రాయచోటి సర్కాజీ, మతగురువు షర్ఫుద్దీన్ మాట్లాడుతూ అబుల్ కలాం స్వాతంత్ర్య ఉద్యమంలో పోషించిన కీలకపాత్ర గురించి, స్వాతంత్ర్యం అనంతరం భారతదేశ రాజకీయాల్లో ఆయన పాత్ర గురించి కొనియాడారు. విద్యాభివృద్ధికి పునాది వేసిన గొప్ప విద్యావేత్తని కొనియాడారు. కార్యక్రమంలో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సగీర్, మస్తాన్, అష్రఫ్, అమీర్, డ్రైవర్ అసోసియేషన్ సభ్యులు షంషేర్ ముస్లిం మైనారిటీలు పాల్గొన్నారు. **రాయచోటి టౌన్ :** స్వాతంత్ర్య సమరయోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ అసలు పేరు 'మొహిద్దిన్ అహ్మద్' అబుల్ కలాం అనేది బిరుదు అని ఆజాద్ కలం పేరు అని కాంగ్రెస్ కమిటీ మైనార్టీ అధ్యక్షుడు ఆడిటర్ మన్సూర్ అలీఖాన్ అన్నారు. ఆలియా బేగం ఖైరుద్దీన్ అహ్మద్ లకు 1888 నవంబర్ 11న మక్కాలో మౌలానా జన్మించారన్నారు. మన దేశంలో విద్య అభివృద్ధికి బాటలు వేసిన తొలి బాటసారి అబుల్ కలామ్ ఆజాద్ అని ఆయన కొనియాడారు. 1947 ఆగస్టు 15 నుండి అంటే స్వాతంత్రం వచ్చిన నాటి నుండి 1958 ఫిబ్రవరి 2 వరకు కేంద్ర విద్యా శాఖ మంత్రిగా సేవలందించారని చెప్పారు. అబుల్ కలామ్ కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీ లోని ప్రసిద్ధ జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయం సహా భారతదేశం అంతటా వివిధ కళాశాలలు స్థాపించబడ్డాయని, ఆయన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ఇచ్చిందన్నారు. అబుల్ కలామ్ ఆజాద్ సేవలను గుర్తుగా 2008లో భారత ప్రభుత్వం ఆయన పుట్టిన రోజును జాతీయ విద్యా దినోత్సవం గా నిర్ణయించిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిసిసి జిల్లా మైనార్టీ సెక్రటరీ యహియా బాష, పట్టణ అధ్యక్షుడు దర్బార్, కాంగ్రెస్ సీనియర్ మైనార్టీ నాయకుడు శర్వాణి షారుక్ ఖాన్,హాఫిజుల్లా, నసీం భాయ్, జిలాన్, అష్రఫ్, హబీబ్ భాషా పాల్గొన్నారు.

భూ నిర్వాసితులందరికీ పరిహారం : కలెక్టర్

ప్రజాశక్తి-పీలేరు

మదనపల్లి-పీలేరు 71వ జాతీయ రహదారి ఏర్పాటులో భూములు కోల్పోయిన బాధితులకు చెల్లించాల్సిన నష్టపరిహారం పంపిణీని వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష అధికారులను ఆదేశించారు. బుధవారం పీలేరు తహశీల్దారు కార్యాలయంలో జాతీయ రహదారి భూ సేకరణ, నష్టపరిహారం పంపిణీపై నేషనల్ హైవే అధికారులు, విఆర్‌ఒలతో కలెక్టర్ సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు-మదనపల్లె నాలుగు లైన్ల జాతీయ రహదారి పూర్తయితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. పెండింగ్ భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వేపులబైలు, బోడుమల్లువారిపల్లి, గూడరేవుపల్లి తదితర గ్రామాల విఆర్‌ఒలతో కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్షించి వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తిచేసి నేషనల్ హైవే అధికారులకు అప్పజెప్పాలన్నారు. అందులో ప్రభుత్వ భూమి, డీకేటి భూమి, పట్టాభూమి ఎన్ని ఎకరాలు, ఇంకా ఎన్ని ఫైల్స్ పెండింగులో ఉన్నాయి, వంటి వివరాలను అడిగి తెలుసుకుని, ఫైల్స్ పెండింగ్ లేకుండా త్వరగా క్లియర్ చేయాలని ఆదేశించారు. భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లింపు 73 శాతం జరిగిందని, ఈ నెల చివరిలోగా మిగిలిన బాధితులకు నష్టపరిహారం చెల్లింపు 80 శాతానికి చేరుకోవాలని అధికారులను తెలిపారు. జాతీయ రహదారి వెళ్లే దారిలో లేవుట్లో ఇళ్ల నిర్మాణం జరిగాయని, వారికి పరిహారం చెల్లింపు కోసం ఎంత ఖర్చు చేశారో అంత ఎస్టిమేషన్ తయారు చేయాలని హౌసింగ్ డిఇకి సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రవి, ఎన్‌హెచ్ డిప్యూటీ తహశీల్దార్ గురుప్రసాద్, విఆర్‌ఒలు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష



పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న వైద్య బృందం

కెజిబివిలో వైద్యాధికారుల పరిశీలన

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో బుధవారం విద్యార్థినిల ఆరోగ్య పరిస్థితులపై స్టేట్ నోడల్ అధికారులు, డిప్యూటీ డిఎంహెచ్ఒ లక్ష్మీ తనిఖీలు చేపట్టారు. పాఠశాలలో ఇతర సౌకర్యాలు పై ఆరా తీశారు. విద్యార్థులకు అందిస్తున్న ఐరన్, పోలిక్ యాసిడ్ ట్యాబెలెట్లు పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నారా లేదా అని పరిశీలించారు. అనంతరం చెంబకూరు పిహెచ్‌సిని తనిఖీ చేశారు. డిసెంబర్22, జనవరి 22న హెచ్‌బి వైద్య పరీక్షలు చేయించుకున్న గర్భిణుల రికార్డును పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందిస్తున్నారా లేదా అని గర్భిణి స్త్రీలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ అధికారులు మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో బాలికా సంరక్షణ పథకం ప్రతి నెల రెండవ, నాల్గవ గురువారం మెడికల్ ఆఫీసర్, ఎంఇఒ, సిడిపిఒ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కమిటీ ఆధ్వర్యంలో ప్రతి గురువారం రెసిడెన్షియల్ పాఠశాలలు పరిశీలించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ హేమలత, మండల మెడికల్ ఆఫీసర్లు డాక్టర్‌నూరుల్లా, డాక్టర్ లీల, డాక్టర్ శ్వేత, ఎస్ఒ.విజయలక్ష్మీ పాల్గొన్నారు.

ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు 'ఉయ్యాలవాడ'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

బ్రిటిష్ ప్రభుత్వ పాలనపై తిరుగుబాటు చేసిన ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని స్థానిక జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ అన్నారు. బుధవారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని మండలంలోని చింతపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1857 నాటి భారత స్వాతంత్ర్య పోరాటానికి పదేళ్ల ముందే బ్రిటిష్ దుష్టపాలనను ఎదిరించి తిరుగుబాటు చేసిన తెలుగు వీరుడన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు సరిత, సరస్వతమ్మ, గురువమందాడి, భారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన గంగమ్మ జాతర

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలోని అనంతపురం గ్రామంలో రెండురోజుల పాటు జరిగిన గంగమ్మ జాతర ముగిసింది. జాతరకు రాయలసీమ ప్రాంతం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వందల సంఖ్యలో చాందిని బండ్లు సందర్శకులను ఆకట్టుకున్నాయి. చెక్కభజన, కోలాటం, జబర్దస్త్, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. బుధవారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకానాథ్ రెడ్డిలకు ఆలయ ప్రత్యేక అధికారి రవీంద్రరాజు, నరసింహారెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోనే అనంతపురం గంగమ్మ జాతర ప్రసిద్ధి చెందిందన్నారు. నియోజక వర్గ ప్రజలంతా సుఖ, శాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఎక్కువ మొత్తంలో టోల్ ఫీజు వసూలు చేయడంతో చిరు వ్యాపారాలు, వాహనదారులు అసహనానికి గురయ్యారు. రోడ్డు ఇరుకుగా ఉండడంతో జాతరకు వచ్చే వాహనాలు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా డిఎస్‌పి శ్రీధర్, సిఐ వరప్రసాద్, ఎస్ఐ వినోద్ కుమార్ భక్తులకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి అస్వస్థకు గురైన వారికి సకాలంలో వైద్యసేవలు అందించారు.

ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు సభ

ప్రజాశక్తి - రామసముద్రం

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రిన్సిపల్ మురళీధర్ ఆధ్వర్యంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదివి మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు విద్యార్థులు, పాల్గొన్నారు.

సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ఎక్కడా ఆరోపణలు, విమర్శలకు తావులేకుండా భూ సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేయాలని సర్వేయర్లకు తహశీల్దార్ కళావతి ఆదేశించారు. మండలంలో ప్రభుత్వం మొదటగా చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా మొదటి విడతగా రీసర్వేకి ఎంపికైన ఎర్ర సానిపల్లి, కన్యమడుగు, పంచాలమర్రి గ్రామాలలో సర్వే పూర్తయినట్లు తెలిపారు. బుధవారం ఈ కార్యక్రమాన్ని మదనపల్లి సర్వే ఆఫ్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ, మండల సర్వేయర్లు సుబ్రహ్మణ్యంలతో కలసి పరిశీలించినట్లు పేర్కొన్నారు. డ్రిల్లింగ్ మిషన్ ద్వారా ఈ సరిహద్దు రాళ్ళను ఏర్పాటు చేయడంతో పని పూర్తి చేసేందుకు వీలు కలుగుతుందని అన్నారు.

భూ ఆక్రమణకు పరిష్కారం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దేవసముద్రం గ్రామంలోని సర్వేనెంబర్ 556/7 లో 1.50 భూమి ఆక్రమణకు గురైందని మురముట్ల రెడ్డమ్మ అనే రైతు ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌ను ఆశ్రయించింది. వివరాల్లోకెళ్తే.. మహిళ రైతు మురముట్ల రెడ్డమ్మ డి పట్టా కలిగిన తన భూమిని నాగినేని చంగయ్య నాయుడు భూమిని ఆక్రమించుకున్నాడని తెలిపారు. 2017లో ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌ను కలిసి చంగయ్య నాయుడుపై ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని ఆవేదన చెందింది. బుధవారం తాహశీల్దార్ నరసింహ కుమార్ తన సిబ్బందితో కలిసి చట్టబద్ధంగా చంగయ్య నాయుడుకి నోటీసులు జారీ చేశారు. జెసిబి ద్వారా భూమిని చదును చేసి బాధితురాలికి తన భూమిని అప్పగించారు. ఆక్రమణకు గురైన రస్తాకు కూడా పరిష్కారం చూపించారు. తహశీల్దార్ చొరవ పట్ల మురుముట్ల రెడ్డమ్మ సంతోషం వ్యక్తం చేసింది. తాను ఐదేళ్ల నుంచి నిరీక్షతో కార్యలయాలు, అధికారుల చుట్టూ తిరిగినా ఎవరూ న్యాయం చేయలేదని, ప్రస్తుత తాసిల్దార్ తన బాధను చూసి చలించిపోయి న్యాయం చేశారని హర్షం వ్యక్తం చేసింది.

ఉత్తమ నాట్య గురువు పురస్కారం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు శ్రీ నటరాజ కూచిపూడి కళామందిర్ నిర్వాహకురాలు హరిత నగేష్ ఉత్తమ నాట్య గురువు పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ వే ఫౌండేషన్ 10వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన నృత్య పోటీల్లో శ్రీ నటరాజ కూచిపూడి కళామందిర్ ద్వారా శిక్షణ పొందిన బాలికలు ఉత్తమ నృత్య ప్రదర్శన ఇచ్చారు. భారతీయ సంప్రదాయ నృత్య కళను కాపాడేందుకు ఎంతో మంది నృత్య కళాకారులను తయారు చేస్తున్న అనితానగేష్ కృషిని అభినందిస్తూ వే ఫౌండేషన్ ఆమెను ఉత్తమ గురువుగా గుర్తించి సత్కరిస్తూ, ఉత్తమ నాట్య గురువు అవార్డును ప్రధానం చేశారు. ఈ సందర్భంగా హరితానగేష్ మాట్లాడుతూ తనను ప్రోత్సహిస్తున్న తన భర్త నగేష్ కుమార్, యోగా గురువులు డాక్టర్ పివిఎస్ లక్ష్మి సుధాకర్ దంపతులకు, కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న నోడల్ అధికారి విజయ్ కుమార్

ప్రజలకు సకాలంలో వైద్యం అందించాలి

ప్రజాశక్తి-కురబలకోట

ప్రజలకు అందుబాటులో ఉంటూ సకాలంలో వైద్యం అందించాలని రాష్ట్రస్థాయి నోడల్‌అధికారి విజయ్ కుమార్, జిల్లా అధికారి ఉషశ్రీ వైద్యులను కోరారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రోజు ఎంతమందికి వైద్యం అందిస్తున్నారనే విషయంపై అరా తీశారు. గర్భిణులకు నిర్వహించే పరీక్షలు, రక్తహీనత, హైరిస్క్ గర్భిణుల పట్ల తీసుకుంటున్న జాగ్రత్తలు పరిశీలించారు. అనంతరం ల్యాబ్ గది,కాన్పులు గది, ఫ్రిజ్ గదులను పరిశీలించారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. గర్భవతులలో రక్తహీనత తలెత్తకుండా ఉండేందుకు తీసుకొన వలసిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్, డాక్టర్ క్రిస్టల్, సిహెచ్ఒలు జయచంద్ర కుమార్, నారాయణ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మైదుకూరు మండల సమావేశం

ప్రజాశక్తి - మైదుకూరు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో గురువారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కులాయమ్మ తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలన్నారు.



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎఎస్ఐ నాయక్

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎఎస్ఐ నాయక్ తెలిపారు. బుధవారం స్థానిక బస్టాండ్ కూడలిలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆటో డ్రైవర్లకు, ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు సరైన ధ్రువ పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్లు వాహనాలు నడపరాదని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారికి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ దర్బార్ భాష పాల్గొన్నారు.

విద్యార్థినిలకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-కలికిరి



నగదు ప్రోత్సాహాలను అందుకుంటున్న విద్యార్థినిలు

వేమన పద్య పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తెలుగు ఉపాధ్యాయురాలు కె.మంగమ్మ నగదు ప్రోత్సకాలను అందిం చారు. గత వారం రెడ్డిసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేమన జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన వేమన పద్య పోటీలలో చదివేవాడ్ల పల్లికి చెందిన ఐదవ తరగతి విద్యార్థిని నిహారిక, 7వ తరగతి విద్యార్థిని సోనియా ఉత్తమ ప్రతిభ కనబరిచి ఫైనల్‌కు చేరుకున్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు సంపత్ కుమార్ ఆధ్వర్యంలో నగదు బహుమతులు ఇచ్చి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఎల్లప్పుడూ పోటీ తత్వం ఉండాలని, అప్పుడప్పుడు ఇలాంటి పోటీ కార్యక్రమాల్లో పాల్గొంటే మానసికంగా ఉల్లాసంగా ఉండటమే కాక, మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు.

రేపు జిల్లా టి20 క్రికెట్ జట్టు ఎంపికలు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

పట్టణంలోని క్రీడా మైదానంలో రూరల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డెవలప్మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా టి20 క్రికెట్ జట్టుకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి అశ్విందర్ సింగ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.సునీల్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టి20 క్రికెట్ జట్టుకు ఎంపిక ప్రక్రియ అండర్-19 సీనియర్స్ విభాగాల్లో జరుగుతాయని అన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9701515415 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సుపరిపాలన కోసం టిడిపి అధికారంలోకి రావాలి : 'బత్యాల'

ప్రజాశక్తి-సుండుపల్లి

రాష్ట్రంలో సుపరి పాలన రావాలంటే టిడిపి అధికారంలోకి రావాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయుడు తెలిపారు. బుధవారం సుండుపల్లి మండలంలోని రాయవరం గ్రామపంచాయతీలో ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. సిఎం జగన్ ఒక్క ఛాన్స్ అనే నెపంతో రాష్ట్రాన్ని అభివృద్ధికి దూరం చేశారని ఆయన విమర్శించారు. వైసిపి పాలనలో అరాచకాలు అక్రమాలు తప్ప ఒరిగిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను ప్రజలందరూ చూస్తూనే ఉన్నారని, అధికార పార్టీ ఆగడాలు తారస్థాయికి చేరాయని ఆయన విమర్శించారు. అరాచక పాలన నుండి ప్రజలందరినీ విముక్తి చేసేందుకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రెడ్డప్ప, రాష్ట్ర నాయకులు ఆనంద్‌నాయక్, దామోదర్ నాయుడు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వాల్మీకిపురం



మృతి చెందిన రమణయ్య

ప్రమాదంలో మృతి చెందాడా.. లేక హత్య చేశారో తెలియదు కానీ.. ఓ వ్యక్తి అను మానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలోని చింతపర్తి విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో చోటు చేసుకొంది. వివరాలు.. మండలంలోని జర్రావారిపల్లి పంచాయతీ వడ్డిపల్లికి చెందిన బండి రమణయ్య (57) ఇరవై ఏళ్ల క్రితం సోమల మండలం కందూరు పంచాయతీ ఉలవలకుంటకు వలస వెళ్లి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవల సొంత పనులపై స్వగ్రామమైన వడ్డిపల్లికి వచ్చి మంగళవారం రాత్రి ఉలవలకుంటకు బయల్దేరాడు. ఈ మధ్య దారిలో ఏం జరిగిందో తెలియదు కానీ.. మార్గమధ్యంలోని చింతపర్తి సబ్ స్టేషన్ వద్ద బుధవారం ఉదయం శవమై కనిపించాడు. ఏదైనా వాహనం ఢీకొని మృతి చెందాడా లేక ఎవరైనా హత్య చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ బిందుమాధవి కేసు నమోదు చేసి, రమణయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బావిలో పడి మరొక యువకుడు..

మదనపల్లె అర్బన్ : బావిలో పడి యువకుడి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని జమ్మికుంటపల్లెకు చెందిన తిప్పన్న కుమారుడు హరీష్ (25)కు మతిస్థిమితం లేదు. మంగళవారం సాయంత్రం ఊరికి సమీపంలోని బావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం వెలుగు చూసింది. గుర్తించిన స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతుదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

అప్పులబాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

ములకలచెరువు : అప్పుల బాధతో డ్రైవర్ ఊరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా, నల్లచెరువు మండలానికి చెందిన జె.అశోక్(33) గత నాలుగేళ్ల క్రితం ములకలచెరువుకు కాపురం వచ్చాడు. ములకలచెరువులో బాడిగింటిలో కాపురం ఉంటూ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి భార్య సుమిత్ర, కుమార్తెలు మన్విత(3), ఇందుప్రియ(7) ఉన్నారు. అశోక్ భార్య సుమిత్ర టైలరింగ్ పని చేస్తోందని, కుటంబ పోషణ కష్టంగా మారడంతో అప్పులు చేశాడని తెలిపారు. పగలంతా ఆటో నడిపిన కుటంబ పోషణ ఖర్చులకు కూడా సరిపోకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ తరుణంలో ఇటీవల కాలంలో తీసుకున్న అప్పులు మళ్లీ తిరిగి ఇవ్వాలని ఒత్తిడి పెంచడంతో చేసిన అప్పులు ఎలా తీర్చలో అనే మనోవేధనకు గురైనట్లు పేర్కొన్నారు. జీవితంపై తనకే విరక్తి పుట్టింది శివరాత్రి పండుగకు భార్య సుమిత్రి పుట్టింటికి వెళ్లడంతో ఇంటిలో ఎవరు లేని సమయంలో ఇంటిలో ఫ్యాన్‌కు తాడుతో ఊరేసుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ప్రైవేట్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు పేర్కొన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.